




వైభవంగా.. వరలక్ష్మీ వ్రతం

- జిల్లా వ్యాప్తంగా సందడిగా మారిన ఆలయాలు
- పరస్పరం వాయనం ఇచ్చుకున్న మహిళలు
- లక్ష్మీదేవికి మహిళల ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆలయాలు, ఇళ్లలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మీ వ్రతాలు సాగాయి. దీంతో జిల్లాలోని ఆలయాలన్నీ మహిళలతో సందడిగా మారాయి. అలాగే ముత్తైదువులను ఇళ్లకు పిలిచి కాళ్లకు పసుపు రాసి వాయినాలు సమర్పించారు. సకల శుభాలతో పాటు అన్ని సంపదలు ఇవ్వాలని లక్ష్మీదేవిని కోరుకున్నారు. నగరంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరీ ఆలయం, దుబ్బా మహాలక్ష్మి ఆలయం, లలితాదేవి ఆలయం, టీటీడీ కల్యాణ మండపం, ఆర్యనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే బోధన్, ఆర్మూర్, భీంగల్ డివిజన్‌లలో మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలు నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్



అమ్మవారికి నైవేద్యాల సమర్పణ



నగరంలోని వాసవీమాత ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు









ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిన సీఎం

- హరీశ్‌రావు రాజీనామా చేయాలనే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రుణమాఫీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే డిసెంబర్ 9వ తేదీన పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మొదటిసారి సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసగించారని తెలిపారు. వంద రోజుల్లో రుణమాఫీతో పాటు తాము ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని చెప్పి రెండవ సారి రైతులకు మోసం చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని ప్రకటించారని అన్నారు. ప్రజలను మరోసారి మోసగించి పార్లమెంట్‌లో గెలిచారని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎన్నికల సభల్లో దేవుళ్లపై కూడా ప్రమాణం చేసి ఎన్నికల్లో గెలిచాక దేవుళ్లను కూడా మోసం చేయడం సిగ్గుచేటన్నారు. ఆగస్టు 15 దాటినప్పటికీ రైతుబంధు ఇవ్వకుండా రుణమాఫీ పేరిట కొంత మంది రైతులకే వర్తింపజేశారని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మూడవ విడత రుణమాఫీ రైతుల జాబితా నేటికీ రాలేదన్నారు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాటతప్పిన వ్యక్తిని తన జీవితంలో చూడలేదన్నారు. మాట తప్పిన ముఖ్యమంత్రి దేశంలో ఎవ్వరూ లేరన్నారు. రుణమాఫీకి 31వేల కోట్లు అవసరం ఉండగా.. కేవలం 17,900 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి చరిత్ర తిరగరాశారని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేవలం 17,900 కోట్ల రూపాయల రుణమాఫీ మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా హరీశ్‌రావు రాజీనామా చేయాలని మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలు, 13 హామీలు వంద రోజుల్లో పూర్తి చేస్తే రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రుణమాఫీ పూర్తిచేయకపోగా హామీలు అటకెక్కగా హరీశ్‌రావు రాజీనామా ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు. 4 వేల పెన్షన్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు 2,500లు, నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇలా అనేక హామీలు ఇచ్చి మాటతప్పిన రేవంత్‌రెడ్డి ఇంకా దిగజారి మాట్లాడుతున్నారని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావు సవాల్‌తో కొందరికైనా రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతో పాటు తన లాంటి ఎందరో ఉద్యమం చేస్తే తెలంగాణ రాష్ట్రం సాధించిందన్నారు. అలాంటి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నేడు పదవిలో రేవంత్‌రెడ్డి ఉన్న విషయం మర్చిపోవద్దన్నారు. రైతుల కోసం బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద శనివారం నిర్వహిస్తున్న సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు.





మెడికల్ కళాశాలలో ఆర్‌ఎంవోల భర్తీ ఎప్పుడు?

- పదేళ్ల క్రితం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభం
- ఇప్పటికీ ఆర్‌ఎంవో పోస్టులను మంజూరు చేయని ప్రభుత్వం
- ఆర్‌ఎంవోలు లేక ఆస్పత్రిలో వైద్య సేవలపై కొరవడిన పర్యవేక్షణ
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల బదిలీలతో మరింత పెరిగిన భారం

నిజామాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించి దశాబ్దం దాటినా కీలకమైన విభాగాలకు పోస్టుల భర్తీ లేదు. కళాశాల ప్రారంభించిన సమయంలో ఆర్‌ఎంవోల (రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్) పోస్టుల అనుమతికి చోటు ఇవ్వకపోవడం వల్ల ఆసుపత్రిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం వేలాది మంది రోగులు వచ్చే ఈ ఆసుపత్రిని పర్యవేక్షించే వారు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై భారం పెరిగిపోతోంది. పదేళ్లుగా ఆర్‌ఎంవోలను నియమించాలని ఎన్ని విజ్ఞప్తులు అధికారులు పంపించినా ఇప్పటివరకు ఫలితం లేదు. ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పోస్టుల మంజూరు చేయలేదు. కొత్త మెడికల్ కళాశాలకు ఆర్‌ఎంవోలను మంజూరు చేసినా పాత కళాశాలకు చేయకపోవడం వల్ల సేవలు అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. బదిలీల వల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్ల వరకు ఇతర మెడికల్ కళాశాలలకు వెళ్లడం వల్ల సేవలు అందించడంలో ఉన్న వైద్యులు ఇబ్బంది పడుతున్నారు.

2014లో మెడికల్ కళాశాల ఏర్పాటు

నిజామాబాద్ మెడికల్ కళాశాలను 2014లో ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మెడికల్ కళాశాలకు అనుమతి ఇచ్చింది. దీంతో పాటు మహబూబ్‌నగర్‌లో కూడా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఈ కళాశాలకు అప్పటి వరకు ఉన్న జిల్లా ఆసుపత్రిని టీచింగ్ ఆసుపత్రిగా అనుసంధానం చేసింది. బోధన్ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్పు చేసింది. టీచింగ్ ఆసుపత్రిగా మార్చిన ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్ల వరకు పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. నాన్ టీచింగ్ పోస్టులకు కూడా అనుమతి మంజూరు చేసింది. పారామెడికల్ సిబ్బంది భర్తీకి అనుమతి ఇచ్చింది. మొదట కొన్ని పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ పద్ధతిన మరికొంత మందిని నియమించింది. మొదట ఈ కళాశాల పరిధిలో ఎంబీబీఎస్‌ను ప్రారంభించారు. ఆరేళ్ల తర్వాత ఎండీ కోర్సులకు కూడా అనుమతి ఇచ్చారు. అనుబంధంగా నర్సింగ్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో ప్రధానంగా వైద్యులు సేవలు అందిస్తున్నారు. మెడికల్ కళాశాలలో తరగతులు నిర్వహించడంతో పాటు ప్రొఫెసర్లు ఆసుపత్రి పరిధిలో ఆపరేషన్లు చేయడంతో పాటు సాధారణ ఓపీని కూడా చూస్తున్నారు. ఈ ఆసుపత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచి సూపరింటెండెంట్‌లను సీనియర్ ప్రొఫెసర్లను నియమిస్తున్నారు. వారి ఆధ్వర్యంలోనే ఆసుపత్రిలో సేవలను అందే విధంగా చూస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రారంభించినప్పుడు ప్రతిరోజూ 500లకు ఉన్న ఓపీ ఎండీ కోర్సులు వచ్చి అన్ని విభాగాలు పెరిగిన తర్వాత ప్రస్తుతం రోజుకు 2500 మంది వరకు ఓపీ పేషెంట్‌లను చూస్తున్నారు.

> **పోస్టుల మంజూరుకు ప్రయత్నాలు..**
> : బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి
>
> ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిధిలోని ఆసుపత్రిలో ఆర్‌ఎంవో పోస్టుల మంజూరుకు ప్రయత్నాలను చేస్తున్నాం. ఇప్పటికే పలు దఫాలు సమీక్షించాం. కాంగ్రెస్ హయాంలోనే ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశాం. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఆర్‌ఎంవో పోస్టులు మంజూరయ్యే విధంగా చూస్తాం.

> **ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం..**
> : సూపరింటెండెంట్ ప్రతిమరాజ్
>
> ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్‌ఎంవో పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. అన్ని మెడికల్ కళాశాలల్లో ఈ పోస్టులకు అనుమతులు ఇచ్చి నిజామాబాద్ కళాశాలకు అనుమతులు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆర్‌ఎంవోలను నియమిస్తే ఆయా విభాగాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఓపీతో పాటు ఇతర రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నాం.

ఆర్‌ఎంవోలు లేక పర్యవేక్షణ కరువు

ఈ ఆసుపత్రిలో ఆయా విభాగాలను పర్యవేక్షించాల్సిన ఆర్‌ఎంవోలను ఇప్పటి వరకు నియమించడం లేదు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల్లో ఆర్‌ఎంవో పోస్టులను మంజూరు చేసిన ఈ మెడికల్ కళాశాలకు మాత్రం అనుమతి ఇచ్చే సమయంలో మంజూరు చేయలేదు. ప్రస్తుతం పేషెంట్‌లు పెరగడం వల్ల కనీసం 12 నుంచి 15 వరకు ఆర్‌ఎంవో పోస్టులు ఉండాలి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మెడికల్ కళాశాలకు కూడా ఆర్‌ఎంవో పోస్టులను మంజూరు చేశారు. రాష్ట్రంలో కేవలం నిజామాబాద్, మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాలలకు మాత్రమే ఈ పోస్టులను మంజూరు చేయలేదు. ప్రొఫెసర్లు, ఆయా విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఈ బాధ్యతలను అప్పచెబుతున్నారు. కళాశాల పరిధిలో ఇప్పటికే పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల అదనపు బాధ్యతలతో వారు ఇబ్బంది పడుతున్నారు. రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు ఆయా విభాగాలకు ఉంటే వచ్చే రోగులకు సేవలు అందడంతో పాటు ఆయా విభాగాలకు అవసరమైన మందులతో పాటు ఇతర వసతులను కూడా వారే పర్యవేక్షిస్తారు. ఇన్‌చార్జిలను నియమించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మధ్య బదిలీల్లో ఎక్కువ మంది ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలలతో పాటు ఇతర మెడికల్ కళాశాలలకు బదిలీపై వెళ్లడంతో ఎక్కువ మందిని ఇక్కడికి బదిలీ చేయకపోవడం వల్ల ఉన్న సిబ్బంది పైనే భారం పెరుగుతోంది.

ఎస్సారెస్పీకి స్వల్ప వరద

- కాకతీయ, లక్ష్మి కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, ఆగస్టు 16: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులోకి వరదనీరు స్వల్పంగా పెరిగిందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా వానాకాలం పంటల కోసం నీటి విడుదల ప్రధానకాలువలు, కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాలువలకు నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 10680క్యూసెక్కుల వరద నీరు చేరుతుందని ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలకు తాగునీటి కోసం మిషన్ భగీరథకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4200క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150క్యూసెక్కులు, సరస్వతికాలువకు 500క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 522మిషన్ భగీరథ, తాగునీటి కోసం 231క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగాశుక్రవారం సాయంత్రానికి 1081.1అడుగులు (48.07టీఎంసీ)లు నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1090.00 అడుగులు (76.894టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 46టీఎంసీల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



మెరుగైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

బోధన్‌రూరల్, ఆగస్టు16: వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. ఓపీలోని రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులపై బోధన్ ఆసుపత్రిని సందర్శించామన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం విధానంపై, మౌలిక వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీరనుందని, త్వరలో పూర్తిస్థాయి వైద్యులను భర్తీ చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. డెంగ్యూ, చికెన్ గున్యా, కరోనా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. బోధన్‌లోని వంద పడకల ఆసుపత్రి జిల్లా కేంద్ర ఆసుపత్రిగా మార్చడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ఆసుపత్రికి నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ పరిధిలో చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఆసుపత్రిలో గైనిక్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు లేకపోవడం ఇబ్బందిగా ఉందని, త్వరలోనే పూర్తిస్థాయి వైద్యులను భర్తీ చేస్తామన్నారు. ఇటీవల జరిగిన బదిలీల ప్రక్రియలో భాగంగా కొంతమంది వైద్యులు వెళ్లారని, తిరిగి వారి స్థానంలో వైద్యులను భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శివశంకర్, డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుమంత్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.




ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న అధికారి





డిచ్‌పల్లిలో బంద్ ప్రశాంతం

డిచ్‌పల్లి, ఆగస్టు 16: ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపార వాణిజ్య కేంద్రాలు మూసివేయించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిన జరిగిన ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన రిజిస్ట్రార్

డిచ్‌పల్లి, ఆగస్టు 16: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, రెగ్యూలర్ 4వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం 5వ రోజు ప్రశాంతంగా జరిగాయి. సైన్స్, ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేం ద్రాన్ని రిజిస్ట్రార్ యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 773 విద్యార్థులకు గాను 738 విద్యార్థులు హాజరయ్యారని 35 మంది గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

టీయూకి వీసీని నియమించాలని సంతకాల సేకరణ


డిచ్‌పల్లి, ఆగస్టు 16: తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీకి వైస్‌ఛాన్స్‌లర్‌ను నియమించాలని సంతకాల సేకరణ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా వీసీని నియమించ కపోవడం బాధాకరమన్నారు. వీసీ వర్సిటీ అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. టీయూకి వీసీ నియామించి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న అందోళనలు చేస్తామని నాయకులు చరణ్, వినిత్, చక్రిలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి ఆగస్టు 16 : మండలంలోని ఘన్‌పూర్ ఇస్లాంపూర కాలనీలో పలు సమస్యలు పరిష్కరించాలని, అలాగే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పలువురు గ్రామస్థులు కోరారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు రామకృష్ణ, భూపతి, హమీద్ పాశా, సమీ, అఖిల్, వసీం పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లో మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

ఆర్మూర్, ముప్కాల్, ఆగస్టు 16 : బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





పొతంగల్ సహకార సంఘంలో అక్రమాలపై
విచారణ ప్రారంభం



పొతంగల్ సహకార సంఘంలో కొనసాగుతున్న విచారణ

కోటగిరి, ఆగస్టు 16 : రాష్ట్రంలోని సహకార సంఘాలకు అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిన పొతంగల్ విశాల సహకార పరపతి సంఘం మరోమారు అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాలకవర్గం నిర్లక్ష్యం, సిబ్బంది ఇష్టారాజ్యం వల్ల అభివృద్ధి బాట నుంచి నష్టాల బాట పట్టింది. సహకార సంఘ నిబంధనలను ఉల్లంఘించిన పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు విండో కార్యదర్శిని తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సంఘంలో సుమారు 4 కోట్ల రూపాయల వరకు అవినీతి, అక్రమాలు జరిగాయంటూ సంఘసభ్యులు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సుమారు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న విచారణ ఎట్టకేలకు ప్రారంభమైంది. పొతంగల్ విశాల పరపతి సంఘాన్ని శుక్రవారం మోర్తాడ్ అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాస్ సహకార సంఘాన్ని సందర్శించారు. సంఘ సభ్యులతో సమావేశమయ్యారు. గతంలో వారు ఫిర్యాదు చేసిన అంశాలతో పాటు మరిన్ని అంశాలపై వివరాలు సేకరించారు. సంఘం నష్టపోవడానికి గల కారణాలను సంఘ సభ్యులు వివరించారు. సంఘ సిబ్బంది, విండో కార్యదర్శి బాధ్యతరహితంగా వ్యవహరించి, సంఘం నష్టపోయేలా చేశారని ఆరోపించారు. పాలకవర్గం చూసిచూడనట్లు వ్యవహరించడంపై అనేక అనుమానాలు ఉన్నాయని వారు వివరించారు. గతంలో రుణమాఫీ కింద మంజూరైన నిధులు సైతం దారి మళ్లినట్లు సభ్యులు ఆరోపించారు. విండో కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల సేల్ టాక్స్, ఇన్‌కమ్ టాక్స్ సుమారు 2.50కోట్లకు పైగా సంఘం చెల్లించాల్సి వచ్చిందన్నారు. పీఎఫ్ కింద 7లక్షల రూపాయలు సంఘం నష్టపోయిందన్నారు. విచారణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘంలో రికార్డులు అన్ని పరిశీలించి నష్టాలకు గల కారణాలను సేకరిస్తామన్నారు. తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

నేటి నుంచి కాచిగూడ, గుంతకల్లు రైలు పునఃప్రారంభం

బోధన్‌రూరల్, ఆగస్టు 16 : మూడునెలల విరామం తర్వాత బోధన్ రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడ, గుంతకల్లు రైలు పునఃప్రారంభం కానుందని రైల్వేఅధికారులు శుక్రవారం వెల్లడించారు. శనివారం ఉదయం బోధన్ నుంచి కాచిగూడకు ఉదయం ఐదుగంటలకు యథావిధిగా రైలు పునఃప్రారంభం కానుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతున్న రైలును మళ్లీ ఆపివేయకుండా ముందులాగే నిరంతరం నడిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే కరీంనగర్ రైలును పునఃప్రారంభించాలని, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం జరిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జేఎల్‌ఎంలకు ప్రమోషన్‌లపై హర్షం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 16 : విద్యుత్ సంస్థలో జూనియర్ లైన్‌మెన్‌లుగా ఉద్యోగాలు పొందిన విధులు నిర్వహించిన వారికి ఎంపీడీసీఎల్ సీఎండి కర్నటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎఎల్‌ఎంగా ప్రమోషన్‌లు పొందడంతో హర్షం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని 57జెఎల్‌ఎంలకు ఎఎల్‌ఎంగా ప్రమోషన్‌లు రావడంతో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈ హరిచందర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, బోకెలతో సన్మానించిన అనంతరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీసీఎల్ సీఎండి వరుణ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌ల్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరేందర్‌నాయక్, కన్వీనర్ కల్ల శ్రీనివాస్‌యాదవ్, ఎన్.సంజీవ్, టి.నర్సయ్య, ఎండి.షకీల్, రాంచందర్, వేణుగోపాల్, సురేష్‌బాబు, అనిల్, ఎల్.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఆపాలి'

బోధన్ రూరల్, ఆగస్టు 16 : బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందువులపై అరాచకాన్నిఖండిస్తూ మండలంలోని కల్దుర్కి గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు మనోహర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జి వెంకటేష్, బూత్ అధ్యక్షులు బలరాం, శివకుమార్, రామగౌండ, సీనియర్ నాయకులు లచ్చప్ప, అశోక్, జంగం శివకుమార్, సాయిలు, శ్రీనివాస్, గంగాధర్, వీరభద్ర, గంగాకిషన్, వివిధ గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

జక్రాన్‌పల్లి, ఆగస్టు 16: ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద్‌రెడ్డి సహకారంతో శుక్రవారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.70వేల విలువ గల క్రీడా సామాగ్రిని ఎంఈవో శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగజమున, బాల్కొండ పీడీ రాజ్‌కుమార్, వీడీసీచైర్మన్ వెంకన్న, మాజీఎస్‌ఎంసీ చైర్మన్ గంగనర్సయ్య, ఫిజికల్ డైరెక్టర్ గంగామోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

మోర్తాడ్, ఆగస్టు 16 : మండల కేంద్రంలోని జాతీయరహదారిపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సుప్రయాణం సౌకర్యం కల్పించడంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలను కించపరుస్తూ మాట్లాడడం తగదన్నారు. కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత పలు గ్రామాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మ ఊరేగింపు నిర్వహించి జాతీయరహదారిపై కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మాజీఎంపీపీ కల్లెడ చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు గిర్మాజీ గోపి, పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, తీగెల సంతోష్, బక్కూరి ఆనంద్, నరేష్, ఉగ్గెర భూమేశ్వర్, నజీర్, హర్షద్, సురేష్, మహిపాల్, రంజిత్, పెండెం శ్రీని వాస్, ఎర్రం శీను పాల్గొన్నారు.

ఏర్గట్ల : మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి మహిళా సాధికారిక మీద దృష్టి పెట్టి మహిళల కోసం మహాలక్ష్మీ పథకం ప్రవేశ పెట్టి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తే జీర్ణించుకోలేక కేటీఆర్ వారిపై అనుచిత వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, గడ్డం జీవన్, ముస్కుమోహన్, బద్దం లింగారెడ్డి, మేకల సాయన్న, కొరిపెల్లి లింగారెడ్డి, ఇప్ప గంగయ్య, సామ్‌సన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



ఏర్గట్లలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సునీల్‌కుమార్

మెండోర : ఉచిత బస్సుల సౌకర్యార్థంపై తెలంగాణ మహిళనుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి మాట్లాడుతూ ఫ్రీ బస్సులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆరు గ్యారంటీల పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓర్వలేక మహిళలు ఆర్టీసీ బస్సులో బ్రేక్ డ్యాన్స్‌లు, రికార్డు డాన్సులు చేయండి అంటు కేటీఆర్ అత్యంత అవహేళనగా మాట్లాడారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, డీసీసీ డెలిగేట్ కార్యదర్శి జైడి సుందరవి పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : మహిళలను కించపర్చేలా మాట్లాడడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావులు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీని చూసి కేటీఆర్ ఓర్చుకోలేక మహిళలను కించపరుస్తూ అగౌరవంగా మాట్లాడడం సరికాదన్నారు.

రైతుల రుణమాఫీ దేశచరిత్రలో నిలిచిపోతుంది

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 16: భారతదేశ చరిత్రలోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోయిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విత్తనాభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతీ రైతుకు సుమారు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామని అన్నారు. సాంకేతిక సమస్యల ఉన్న రైతుల త్వరలోనే సరిచేసి రుణమాఫీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని, ఇచ్చిన మాట ప్రకారం 27 రోజుల్లో రుణమాఫీ చేశారని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడంతో ఓర్వలేని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.లక్ష రుణమాఫీని చేయడానికి నానా తంటాలు పడిన బీఆర్ఎస్ నాయకులను రైతులు గమనించారని, కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్‌రావు తన మాట ప్రకారం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రవి, ముప్కాల్ మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో రుణమాఫీపై కృతజ్ఞత తీర్మానం



సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత తీర్మానం చేస్తూ ర్యాలీగా వెళ్తున్న నాగాపూర్ రైతులు

ముప్కాల్, ఆగస్టు 16 : శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసినందుకు శుక్రవారం బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

బాల్కొండ మండల కేంద్రం వరకు నాగాపూర్ రైతులు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్, అగ్రికల్చర్ అధికారులకు తీర్మానపత్రాన్ని అందజేశారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్



స్టాక్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 16 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈపాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని ఎరువుల దుకాణ యజమానులను జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం భీమ్‌గల్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ మల్లయ్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రతీ దుకాణ యాజమాని స్టాక్ వివరాలను బోర్డుపై రాసి అందరికి కనిపించేలా ఉంచాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈపాస్ ద్వారా ఎరువులను విక్రయించాలని అన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసు కుంటామని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లయ్య, ఏఈవో లక్‌పతి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 16: మండలంలోని ఉప్లూర్ గ్రామంలోని కటికె భవనంలో 11మంది పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై డి.అనిల్‌రెడ్డి తెలిపారు. రూ.8440 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నందిపేట ఎస్ఐగా హరిబాబు

నందిపేట, ఆగస్టు 16: నందిపేట ఎస్ఐగా ఏ హరిబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. భీమ్‌గల్ ఎస్ఐగా విధులు నిర్వహించిన హరిబాబు ఇటీవల జరిగిన ఎస్ఐల బదిలీలలో నందిపేటకు వచ్చారు. నందిపేట ఎస్ఐగా పనిచేసిన జి.రాహుల్ హెగ్డే నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్ళారు. అనుమానితులు గ్రామాల్లో సంచరించిన, గొడవలు జరిగే సూచనలు ఉన్నా సెల్ నెంబరు 8712659861 కు కాల్ చేయాలని ఎస్ఐ ఏ.హరిబాబు కోరారు.

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు ఎస్సైలు బదిలీ అయ్యారని ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఎస్సైలు అశోక్, హన్మాండ్లు బదిలీ కావడంతో శుక్రవారం పోలీస్ సిబ్బంది వారిని పట్టుశాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఎస్సై అశోక్ ఆదిలాబాద్ బదిలీ కాగా, ఎస్సై హన్మాండ్లు నిజామాబాద్-2టౌన్‌కు బదిలీపై వెళ్ళారు.

బోధన్‌రూరల్ : బోధన్ రూరల్ ఎస్ఐగా ఎం.రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ నాగనాథ్ వేల్పూర్‌కు బదిలీ అయ్యారు. కమ్మర్‌పల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ బోధన్ ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఇసుక రవాణా, మట్కా, జూదంపై కఠిన చర్యలు చేపడతామన్నారు.

నవీపేట : నవీపేట ఎస్ఐగా కే.వినయ్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్ఐగా పని చేసిన యాదగిరి గౌడ్ మోపాల్‌కు బదిలీ కాగా వేల్పూర్ ఎస్ఐగా పని చేసిన కే.వినయ్ నవీపేట ఎస్ఐగా బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ


డిచ్‌పల్లి, ఆగస్టు 16 : 44వ జాతీయ రహదారి గన్నారం శివారులో శుక్రవారం నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని అతివేగంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొందని, ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. ఈ ప్రమాదంలో లారీక్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కొని రెండు గంటల పాటు తీవ్ర నరకయాతన అనుభించినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే క్షతగాత్రుడిని 108లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి యువకుడి మృతి

డిచ్‌పల్లి, ఆగస్టు 16 : మోపాల్ మండలం కంజర గ్రామానికి చెందిన గుడి ప్రణయ్(22) అనేయువకుడు గురువారం ముల్లంగి గ్రామ శివారులో నీటిలో పడి మృతిచెందాడని ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడి తండ్రి సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిప్రి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ అందజేత

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 16 : ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం 1993-94 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు తమవంతు చేయూతను అందించారు. పూర్వవిద్యార్థి పెద్ది జ్ఞానేశ్వర్ తన తండ్రి రాజేశ్వర్ జ్ఞాపకార్థం రూ.40వేల విలువ చేసే ఐదు బీరువాలను సమకూర్చగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మరో పూర్వవిద్యార్థి బండికృష్ణ రూ.35వేల విలువ చేసే కంప్యూటర్‌ను పాఠశాలకు వితరణ చేశారు.





జక్రాన్‌పల్లిలో కురిసిన భారీ వర్షం

జక్రాన్‌పల్లి, ఆగస్టు16: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు భారీ వర్షం కురువడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. భారీవర్షం కురువడంతో వివిధ గ్రామాల చెరువులోకి నీరు వచ్చి చేరింది. మూడు రోజుల పాటు వర్షాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

కోటగిరిలో ఓ మోస్తరు..

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 10 రోజులుగా వర్షం లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఓ మోస్తరు వర్షం కురియడంతో వరి, సోయా పంటలకు జీవం పోసినట్లయింది.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

నవీపేట, ఆగస్టు 16 : నవీపేటలోని బాసర రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ విషయంపై శుక్రవారం లైన్‌మెన్ కృష్ణ నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో ఇటీవల తరుచుగా ట్రాన్స్‌ఫార్మర్ ఆయిళ్ల చోరీకి గురవుతున్నాయని, వెంటనే దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

'హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు'

జక్రాన్‌పల్లి, ఆగస్టు 16: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సీహెచ్. తిరుపతి అన్నారు. శుక్రవారం సాయంత్రం జక్రాన్‌పల్లి, చందమియాబాగ్‌తండా, పడకల్ గ్రామాల్లో వాహనదారులకు ఎస్సై సీహెచ్.తిరుపతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని, రాంగ్ రూట్‌లో వెళ్ళవద్దని సూచించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కోటగిరి, ఆగస్టు 16 : కోటగిరి మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్, రవి యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సహకార సంఘం ఆవరణలో ఆక్యుప్రెషర్, వివిధ వ్యాధులకు సంబంధించి శిబిరం ఏర్పాటు చేశారు. మరో ఆరురోజుల పాటు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో అధిక బరువు, రక్తపోటు, మెడనొప్పి, తలనొప్పి, మధుమేహం, ఏసీడీటీ, థైరాయిడ్, వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్సలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గంగాధర్ దేశాయ్, విఠల్‌సెట్, అశ్విన్‌సెట్, లక్ష్మణ్, రవి, కిషోర్, శ్రీధర్, నర్సయ్య, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటి జ్వర సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

వేల్పూర్, ఆగస్టు 16 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వంలో నిర్వహించిన కార్యక్ర మంలో గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు ప్రతీ ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులపై నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇంటి చుట్టు పరిసరాల్లో వారు పరిశీలిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షపు నీరు ఇంటి చుట్టు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు.

జాన్కంపేట్ గ్రామంలో నిర్వహించిన కార్యక్ర మంలో ఆరోగ్య కార్యకర్త కమల, పీహెచ్‌వో నారాయణ, ఆశవర్కర్‌లు కళావతి, వినోద, ఆయా గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని కించపరుస్తూ మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణలో ఉన్న మహిళల పట్ల అగౌరవంగా వాళ్లను కించపరుస్తూ ఆర్టీసి బస్సులలో బ్రేక్ డ్యాన్సులు చేయాలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేతలు కెటిఆర్ దిష్టిబొమ్మకు చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌లు మాట్లాడుతూ క్లబ్బులలో గడిపిన కెటిఆర్‌కు మహిళలను గౌరవించడం తెలియదని మహిళల పట్ల తప్పుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దూర ప్రయాణం చేసుకునే మహిళలు బస్సులలో సమయాన్ని వృధా చేయకుండా అల్లికలు చేస్తుంటే వారి ఆనందాన్ని తట్టుకోలేని కెటిఆర్ వ్యంగ్యంగా మహిళలను బస్సుల్లో రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోండని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, ఆకుల సుజాత, సంతోష్, నరేందర్‌గౌడ్, రేవతి, సుజాత, ప్రమోద్, వేణురాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీలు



ఫుట్‌బాల్ ఆట ఆడుతున్న క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఆగస్టు 16: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కవిత సౌజన్యంతో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఏఆర్ ఏసీపీ నాగయ్య, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి పాల్గొనలు హాజరై మాట్లాడారు. అంతకుముందు అతిథులు క్రీడాకారుల గౌరవవందనాన్ని స్వీకరించారు. భారత్ తరపున జట్టులో రాణిస్తున్న జిల్లా క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని 9 జిల్లాలు పాల్గొంటున్నాయని, నాకౌట్ పద్ధతిలో ఈ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫారుఖ్ అలీ, మహ్మద్ జావిద్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈగసంజీవరెడ్డి, బొబ్బిలి నర్సయ్య, రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజరెడ్డి, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన రెవెన్యూ ఉద్యోగులు



కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 16: ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన కోదండరాంను జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి అభినందించారు. ట్రేసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గౌతంకుమార్‌ల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, తదితరులు కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు తహశీల్దార్ నరేష్, నయాబ్ తహశీల్దార్ దత్తాద్రి, వినోద్, శ్రీనివాస్, సంతోష్, తదితరులు ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం పూజలు



ధర్పల్లి, ఆగస్టు 16: మండల కేంద్రంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వాయనాలు సమర్పించారు. మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి మండల మహిళలకు వరలక్ష్మి వ్రతం శుభాకాంక్షలు తెలిపారు.

నగర పాలక సంస్థ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

- కబ్జా స్థలాన్ని పరిశీలించిన మంద మకరంద్

సుభాష్‌నగర్, ఆగస్టు 16: నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని జోన్-1 పరిధిలో పర్యటించి పారిశుధ్య ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జోన్-1 కార్యాలయంలోని రికార్డులు, హాజరుపట్టికను పరిశీలించారు. సిబ్బంది హాజరుపై శానిటరి ఇన్స్‌పెక్టర్ ప్రశాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. 35 డివిజన్ పరిధిలో చెత్త సేకరణను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాలువలు నిలువలో నీరు రోడ్లపైకి రాకుండా చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ ప్రశాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్..

నగర పాలక సంస్థ పరిధిలోని 13వ డివిజన్‌లోని సర్వే నెంబర్ 19 స్థలాన్ని నగర మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. కొద్దిరోజులుగా అక్రమంగా లే అవుట్ వేశారని ఆరోపనులు వస్తున్న నేపథ్యంలో స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట పట్టణ ప్రణాళిక అధికారి సత్యనారాయణ, ఇతర అధికారులు ఉన్నారు. అలాగే నగరంలోని రెండో డివిజన్ దాస్‌నగర్ వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాల సముదాయాన్ని కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న భోజన వసతిపై, పరిశుభ్రత పారిశుభ్రంపై పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ నుంచి మురుగునీరు బయటకు వెళ్లే సమస్యను పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ట్రాక్టర్‌పై ర్యాలీగా వస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఆగస్టు 16: ఎన్నికల సమయంలో ప్రజలకు, రైతులకు ఇచ్చిన మాటలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన రైతు కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. ఇప్పుడు రైతులకు సుమారు 32వేల కోట్ల రూపాయలను రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఈ పార్టీలకు బుద్ధి చెప్పాలని అన్నారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, లింగన్న, సొసైటీ ఛైర్మన్లు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు..

సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రుణమాఫీపై శుక్రవారం మండల కేంద్రంలో పెద్దఎత్తున ట్రాక్టర్‌తో ర్యాలీ నిర్వహించాలని పార్టీ నాయకులు సన్నాహాలు చేశారు. అయితే ర్యాలీ అనుమతి లేకుండా నిర్వహించరాదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై సీరియస్ అయిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

పెద్దబజార్, ఆగస్టు 16: ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవనగర్‌లోని ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి నందు బ్రిడ్జ్ గ్యాప్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, నాసేంద్రియాల క్యాన్సర్ ఎక్కువగా సోకుతుందని వ్యాధి ముదిరేవరకు తెలుసుకోకపోవడం వల్ల ప్రాణాలకు ముప్పు వస్తుందన్నారు. అందుకే ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ కోసం ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులు క్యాన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని దీనిమూలంగా ప్రాథమిక సమయంలోనే గుర్తించి వైద్యం చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం డాక్టర్ చిన్నబాబు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సూరిబాబు, ఆల్ పెన్షనర్స్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఈవిఎల్ నారాయణ, పురుషోత్తం, ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అండర్-11 చెస్ పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 16: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 18న అండర్-11 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల అభ్యాస పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు 1-1-2013 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జన్మదిన ధృవపత్రాన్ని, సొంత చెస్ బోర్డును తెచ్చుకోవాలన్నారు. వివరాల కోసం 9440007004 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

మాజీ ప్రధాని వాజ్‌పేయి భారత్‌ను అనుశక్తిగా మార్చిన గొప్ప వ్యక్తి

పెద్దబజార్, ఆగస్టు 16: అటల్‌బిహారి వాజ్‌పై భారత్‌ను అనుశక్తిగా మార్చిన గొప్ప వ్యక్తి అని బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బిజెపి కార్యాలయంలో భారతరత్న అటల్‌బిహారి వాజ్‌పై వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి రెండు సీట్ల నుంచి 303 వరకు పార్టీ ఎదగడానికి మూల కారణం అటల్‌బిహారి వాజ్‌పై అని అన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ప్రధానమంత్రి స్థాయి వరకు ఎదిగిన గొప్ప నాయకుడని అన్నారు. టెలికాం రంగంలో నూతన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. సంస్కరణాలను ముందుకు తీసుకెళ్తూ సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. దేశ పురోభివృద్ధి కోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఒక్క ఓటుతో తన ప్రధాన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మినారాయణ, న్యాలంరాజు, నారాయణయాదవ్, కిశోర్, భరత్‌భూషన్, రోషన్‌లాల్ బోరా, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జక్రాన్‌పల్లిలో రజకులపై వీడీసీ దౌర్జన్యం'

పెద్దబజార్, ఆగస్టు 16: జక్రాన్‌పల్లి గ్రామంలోని వీడీసీ తమపై దౌర్జన్యం చేస్తుందని ఆ గ్రామ రజకులు ఆరోపించారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ జక్రాన్‌పల్లి గ్రామంలో విడిసి కమిటీ సభ్యులు రజకులను గ్రామం నుంచి బహిష్కరించారని పేర్కొన్నారు. గ్రామంలో ఎవరైనా తమతో మాట్లాడితే జరిమానాలు విధిస్తామని హుకూం జారీ చేశారని తెలిపారు. గత నెలలో గ్రామ బహిష్కరణపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. కానీ పోలీసులు ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమపైనే కేసులు నమోదు చేస్తారా అంటూ విడిసి కమిటీ సభ్యులు తమపై దాడి చేశారని రజకులు ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఆసుపత్రులల్లో సేవలు నిలిపివేత

పెద్దబజార్, ఆగస్టు 16: జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రులల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నామని, అత్యవసర సేవలు మాత్రమే కొనసాగించడం జరుగుతుందని ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యులు దామోదర్‌రావు, శ్రీశైలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో యువ పీజీ డాక్టర్‌ను అత్యాచారం చేసిన ఘటనకు నిరసనగా నగరంలో శనివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. పోలీసులు కేసును సరైన రీతిలో పరిశోధన చేయకపోవడంతో హైకోర్టు ఆ కేసును సీబీఐకి అప్పగించిందని విచారణ ఏ విధంగా చేస్తున్నారో మరి విచారణలో ఎలాంటి రాజకీయం లేకుండా చేస్తే తమకు న్యాయం జరుగుతుందన్నారు. తాము అనేక మంది ప్రాణాలను రక్షించే బాధ్యతలో ఉన్నామని అలాంటిది తమకే భద్రత లేకపోతే తాము విధులు ఎలా నిర్వహించగలుగుతామని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నింధితునికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కామారెడ్డి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణ, కార్యదర్శి అర్వింద్‌గౌడ్‌లు తెలిపారు.

'నిందితుడిని కఠినంగా శిక్షించాలి'

పెద్దబజార్, ఆగస్టు 16: పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో విధుల్లో ఉన్న పీడీ మెడికల్ విద్యార్థినిపై లైంగిక దాడి చేసి హత్యకు పాల్పడిన ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి రైల్వే స్టేషన్, తిలక్‌గార్డెన్, ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ అత్యాచార ఘటన నింధితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని దోషులుగా నిర్ధారించబడిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి వాడాలి



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

ఖిల్లా, ఆగస్టు 16: వాహనం నడిపేవారు ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని ట్రాఫిక్ ఏసిపి నారాయణ అన్నారు. పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ ఆదేశాల మేరకు నగరంలోని ఆర్టీసి బస్టాండ్ వద్ద హెల్మెట్ వాడకంపై కళాజాత సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదంలో ప్రాణనష్టం జరగడానికి అవకాశం ఉండదన్నారు. కొన్ని సందర్భాలలో హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదానికి గురైన వారు తీవ్ర గాయాలపాలవుతున్నారని అన్నారు. దీనివల్ల రోజుల తరబడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ఏఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ఒకరి అదృశ్యం

ఖిల్లా, ఆగస్టు 16: గన్నారం గ్రామానికి చెందిన కుంకల గణేష్ (21) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి అదృశ్యమైనట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. గన్నారం గ్రామానికి చెందిన గణేష్ మతిస్థిమితం సరిగా లేనందున ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తుంటారని అన్నారు. ఆగస్టు 15న ఎప్పటిలాగే ఆసుపత్రికి వచ్చి చూయించుకున్నారు. రాత్రి అక్కడే పడుకున్నారు. ఉదయం లేచి చూసేసరికి యువకుడు గణేష్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికిన ఆచూకి లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

ఖిల్లా, ఆగస్టు 16: నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల భవనంపై నుంచి ప్రమాదవశాత్తు తలతిరిగి పడి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన కవితబన్సారి(30), కుమార్‌బన్సారీలు బతుకు దెరువు కోసం నగరానికి గత వారం రోజుల క్రితం వచ్చారు. సాయినగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చి గొడవ పడ్డారు. భార్య కవిత గత మూడు రోజులుగా అన్నం తినడం లేదు. దీంతో నీరసించిపోయిన మృతురాలు పని చేస్తున్న భవనంపై నుంచి జారీ కిందపడింది. ఈ ఘటనలో తీవ్రగాయాలు కాగ చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలి పారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారు.

టీజీఎన్‌పీడీసీఎల్‌లో ప్రమోషన్ల పర్వం మొదలు

జిల్లా వ్యాప్తంగా జేఎల్ఎం నుంచి ఏఎల్ఎం ప్రమోషన్లు ఇస్తూ ఉత్తర్వులు



సుభాష్‌నగర్, ఆగస్టు 16: టీజీ ఎన్‌పీడీసీఎల్‌లో ప్రమోషన్ల పర్వం మొదలైంది. గత నాలుగైదు సంవత్సరాల నుంచి ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి తీపి కబురు అందించారు. శుక్రవారం నుంచి పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గత కొంత కాలంగా ప్రమోషన్లు లేకపోవడంతో విద్యుత్ శాఖ ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రమోషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా జేఎల్ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు వివిధ హోదాలోగల ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వలేదు. శుక్రవారం నిజామాబాద్ సర్కిల్ పరిధిలో డిఈలు ప్రస్తుతం పనిచేస్తున్న అర్హులైన జూనియర్ లైన్‌మెన్‌లకు అసిస్టెంట్ లైన్‌మెన్‌లుగా పదోన్నతులు కల్పించారు. జిల్లా సర్కిల్ పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో సుమారు 223 మందికి జేఎల్ఎం నుంచి ఏఎల్ఎం గా పదోన్నతి కల్పించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 97 మంది, బోధన్ డివిజన్ పరిధిలో 65 మంది, ఆర్మూర్ డివిజన్ పరిధిలో 62 మందికి పదోన్నతులు కల్పిస్తూ స్థానిక డిఈలు ఉత్తర్వులు అందజేశారు. ఇవేకాకుండా శనివారం నుంచి అసిస్టెంట్ లైన్‌మెన్ నుంచి లైన్‌మెన్‌కు, లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్స్‌పెక్టర్ వరకు, లైన్ ఇన్స్‌పెక్టర్ నుంచి సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ వరకు, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్ నుంచి ఫోర్‌మెన్ వరకు పదోన్నతులు కల్పించనున్నారు. ఐదు సంవత్సరాల నుంచి పదోన్నతులు లేకపోవడంతో నిరాశలో ఉన్న ఉద్యోగులకు పదోన్నతలు కల్పించడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యుత్ శాఖ ఐఎన్‌టీయూసీ 327 ఆధ్వర్యంలో స్థానిక పవర్ హౌజ్ కార్యాలయంలో 327 యూనియన్ అధ్యక్షుడు గంగాధర్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు ఒకరినొకరు స్వీట్లు పంచుకున్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.60	రూ.170	రూ. 200
వెన్‌కాబ్(కిలో)	రూ.70	రూ.180	రూ. 210

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,500	రూ.865

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డబుల్ ఇస్మార్ట్ (9.00, 7.05)
: మిస్టర్ బచ్చన్ (12.25, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (3.50)
స్క్రీన్-2 : మిస్టర్ బచ్చన్ (9.10, 7.15)
: డబుల్ ఇస్మార్ట్ (12.35, 10.40)
: కమిటీ కుర్రాళ్లు (4.00)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (9.50, 1.05, 10.40)
: ఖేల్ ఖేల్ మెన్ (హిందీ) (4.20)
: తంగాలన్ (7.20)
స్క్రీన్-4 : తంగాలన్ (9.30, 12.50, 4.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
: వేధ (హిందీ) (10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డబుల్ స్మార్ట్ (10.10, 4.15, 10.20)
: మిస్టర్ బచ్చన్ (1.15, 7.20)
స్క్రీన్-2 : స్త్రీ-2 (హిందీ) (10.15)
: తంగాలన్ (1.15, 7.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.20, 10.20)
స్క్రీన్-3 : మిస్టర్ బచ్చన్ (10.10,10.20)
: డబుల్ ఇస్మార్ట్ (1.10, 7.10)
: స్త్రీ-2 (హిందీ) (4.15)

దేవి : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (6.15, 9.15)
నటరాజ్ : స్త్రీ-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: డబుల్ స్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్